

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

జహీరాబాద్‌పై
సీఎం ఫోకస్

- ఎంపీ స్థానం గెలుపుకోసం రేవంత్‌రెడ్డి కసరత్తు
- దృష్టి కేంద్రీకరించిన రాష్ట్ర స్థాయి నేతలు, ఎమ్మెల్యేలు
- పార్లమెంట్ పరిధిలో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- గెలుపే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ శ్రేణులతో సమావేశాలు
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లోక్‌సభలో పునరావృతం అయ్యేలా వ్యూహాలు

కామారెడ్డి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు పోతుంది. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను లోక్‌సభ ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఉత్సాహంతో కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లో దూకుడు పెంచనుంది. ఇందులో భాగంగా జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించుకునేందుకు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ పరిధిలోని నలుగురు ఎమ్మెల్యేలతో పాటు ముఖ్యనేతలతో సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎన్నికల్లో అభ్యర్థి గెలుపుకై పాటించాల్సిన వ్యూహాలపై నేతలతో సీఎం చర్చించారు. ఎంపీ అభ్యర్థి గెలుపు బాధ్యత ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు ముఖ్యనేతలదేనని సీఎం రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పినట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి జహీరాబాద్ ఎంపీ ఎన్నికలపై సమీక్షించిన నేపథ్యంలో ఇక ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించినున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం దక్కేనా?

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం గతంలో కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. నియోజకవర్గాల పునర్విభజనతో పార్లమెంటు నియోజకవర్గం 2008లో ఏర్పడింది. 2009లో తొలిసారిగా పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి సురేష్ షెట్కార్ విజయం సాధించారు. ఈ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. గతంలో ఈ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థులైన షబ్బీర్‌అలీ, గీతారెడ్డి, కృష్ణారెడ్డి, దామోదర్ రాజనర్సింహ, జనార్ధన్‌గౌడ్ ఎమ్మెల్యేగా పని చేశారు. 2009 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సురేష్‌షెట్కార్, టీఆర్ఎస్ అభ్యర్థి సయ్యద్ యూసుఫ్ అలీపై 17వేల మెజార్టీతో విజయం సాధించారు. ఇలాంటి కాంగ్రెస్‌కు కంచుకోట ఉన్న జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఉద్యమ నేపథ్యంలో రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ 2014, 2019 ఎన్నికల్లో గెలిచారు. అయితే ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, బీఆర్ఎస్ బలహీనపడడం, బీజేపీకి అంతపట్టులేకపోవడం దీనికి తోడు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో ఈ ఎన్నికల్లోనైనా పార్లమెంటు నియోజక వర్గంపై మరోసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేసేందుకు ఆ పార్టీ దృష్టి పెట్టింది.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి

ఈ లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్‌కు కీలకం కానున్నాయి. రాష్ట్రంలోని మెజార్టీ ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ అధిష్ఠానం వ్యూహాత్మకంగా ముందుకు పోతోంది. ప్రతీ ఎంపీ స్థానాన్ని గెలుచుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సైతం దృష్టి కేంద్రీకరించారు. ఇందులో భాగంగా జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉంది. ఈ రెండు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు చాలా మంది ఉన్నారు. వీరంతా విభేదాలను పక్కన బెట్టి సురేష్‌షెటార్ గెలుపు కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జహీరాబాద్ ఎంపీ స్థానంలో ఎలాగైన కాంగ్రెస్ జెండాను ఎగురవేసి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు పార్టీలోని సీనియర్ నాయకులు ఐక్యంగా ముందుకు కదలనున్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సీనియర్ నేతలతో పాటు ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, నేతలు ఏనుగు రవీందర్‌రెడ్డి, మరికొందరు ముఖ్యనేతలు సమన్వయంతో ముందుకుపోతూ సురేష్‌షెట్కార్ తరపున విస్తృతంగా చేపట్టనున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎవరికి వారే సమావేశాలు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలంటూ ఆ పార్టీ శ్రేణులను సైతం అప్రమత్తం చేస్తున్నారు.

ప్రచారంపై వ్యూహాలు

జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గాన్ని ఎలాగైన కైవసం చేసుకోవాలనే అశతో జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు దృష్టి సారించారు. అన్ని పార్టీలకంటే ముందుగానే కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించింది. మొదటి జాబితాలోనే జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా సురేష్‌షెట్కార్ ఖరారు చేసింది. అప్పటి నుంచి పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంపై ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ సైతం ఎన్నికల కమిషన్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయనుంది. ఇరు జిల్లాలోని కాంగ్రెస్ ముఖ్యనేతలను అభ్యర్థి సురేష్‌షెట్కార్ కలుస్తూ సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. ప్రచారంపై దృష్టి సారించి ఏడు నియోజకవర్గాల్లో ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకుంటూ ముందుకు పోతున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని ఇన్‌చార్జీలతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి సభలు, సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా కాంగ్రెస్ సీనియర్లు సైతం సురేష్ షెట్కార్ తరపున ప్రచారం చేయనున్నారు.

బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తాం

- పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి
- కార్యకర్తలకు అండగా ఉంటాం..
- అక్రమ కేసులకు భయపడేది లేదు
- కామారెడ్డి, ఎల్లారెడ్డి సభలో ఎమ్మెల్యే హరీష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌రావు

కామారెడ్డి, మార్చి 31(ఆంధ్రజ్యోతి)/కామారెడ్డి టౌన్: భవిష్యత్తులో రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే హరీష్‌రావు పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోని ఫలితాలను పార్టీ శ్రేణులు మర్చిపోవాలని గతం గతహ అని వచ్చే పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటి కేసీఆర్‌కు జహీరాబాద్ ఎంపీ సీటును కానుకగా ఇవ్వాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు 40 రోజుల పాటు కష్టపడి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు గురి చేస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు తామంతా అండగా ఉంటామని కేసులకు భయపడవద్దన్నారు. తెలంగాణ ఉద్యమం తొలినాళ్లలో గులాబీ జెండాను గుండెకు తాకుకొని తొలి జిల్లా పరిషత్‌ను కైవసం చేసుకున్న ప్రాంతం కామారెడ్డి అని గుర్తు చేశారు. కామారెడ్డి పట్టణ కేంద్రంలోని సత్యగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో, లింగంపేట మండల కేంద్రంలోని మరో ఫంక్షన్‌హాల్‌లో కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల పార్లమెంట్ ఎన్నికల బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హరీష్‌రావు హాజరయ్యారు.

బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తున్న రేవంత్‌రెడ్డి

బీఆర్ఎస్ నేతలే టార్గెట్‌గా చేసుకుని కేసులు పెట్టడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్లు ఎమ్మెల్యే హరీష్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్‌పై, తమ పార్టీ నేతలపై, అనుకూల వ్యక్తులపై అవినీతి, అక్రమాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం భయపెట్టే ప్రయత్నాలు చేస్తుందని ఇందుకు ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనమని ఆయన చెప్పుకొచ్చారు. అవినీతి, అక్రమాలతో కేసీఆర్‌పై బురదజల్లే కుట్రలు రేవంత్‌రెడ్డి చేస్తున్నాడని హరీష్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. అక్రమ కేసులపై బీఆర్ఎస్ భయపడేది లేదని ఇలాంటివి ఎన్నో చూశామని ఉద్యమ పార్టీగా ఎదుర్కొంటామన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాలపైనే దృష్టి సారించిందని ప్రతి పక్షాలపై రేవంత్‌రెడ్డిల అక్రమ కేసులు పెట్టలేదని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించకుండా ప్రతిపక్షాలను బ్లాక్‌మెయిల్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోపించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు సోషల్ మీడియాలో లీక్‌ల న్యూస్‌లు ఇస్తు, ఫేక్ వార్తలు రాయిస్తూ గ్లోబల్ ప్రచారం చేస్తున్నారే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ మారిన కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లు వెంటనే రాజీనామా చేయాలని స్పీకర్ వారిపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మారి నోళ్లకు భవిష్యత్తులో బీఆర్ఎస్‌లోకి నో ఎంట్రీ ఉంటుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు జిల్లాల విభజన చేసి కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. కానీ రేవంత్‌రెడ్డి కేవలం కేసీఆర్‌పై కక్షసాధించేందుకు కొత్త జిల్లాలను తొలగిస్తానంటూ మరో నాటకానికి తెరలేపుతున్నాడని ఆరోపించారు.

ఎండిన పంటల పరిశీలన

ఎల్లారెడ్డి నియోజకవర్గం, లింగంపేట మండల కేంద్రంలో సాగునీరు అందక ఎండిన పంటలను ఎమ్మెల్యేలు హరీష్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డిలు ఆదివారం పరిశీలించారు. సాగునీరు అందక వరి పంట ఎండిపోవడంతో రైతులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

హరీష్‌రావు ముందు ఎంపీటీసీ భర్త నిరసన

కామారెడ్డి జిల్లా కేంద్రంలో సత్యగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీష్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అయితే ఆ సమావేశంలో మాచారెడ్డి మండల ఎంపీటీసీ భర్త రాగుల ప్రభాకర్ సభ వేదిక ముందట కింద కూర్చోని నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి ఎన్నో సంవత్స రాల నుంచి సేవలు చేస్తున్నప్పటికీ పార్టీ తనను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తన నిరసనను తెలిపారు.

పది పైసల పని చేయని పాటిల్
- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

దేశంలో సుమారు 500ల మందికిపైగా ఎంపీలు ఉన్నారు. గత పదేళ్లలో పది పైసలు కూడా పనిచేయని ఎంపీ ఎవరైన ఉన్నారంటే జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అని అన్నారు. బీఆర్ఎస్ బీబీ పాటిల్‌కు రెండుసార్లు టికెట్ ఇచ్చి పార్టీ శ్రేణులు గెలిపించుకుంటే కన్నతల్లిని మోసం చేసినట్లు రాత్రికి రాత్రే బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన ద్రోహి బీబీ పాటిల్ అన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు పాటిల్ జిల్లాలోని ఏ ఒక్కగ్రామంలో పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకున్న దాఖలాలు లేవని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశామని ప్రస్తుతం ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తాం
- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ లోక్‌సభ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించుకుని గులాబీ జెండా ఎగురవేస్తామని కేసీఆర్ రుణం తీర్చుకుంటానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు అబద్దపు వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేశాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ బండారం బయటపడునుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్‌షిండే, జనార్ధన్‌గౌడ్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధరామేశ్వర ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సిద్ధరామేశ్వర ఆలయంలో
కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

భిక్కనూరు, మార్చి 31: మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం ఉదయం ఆలయంలో స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ అగ్ని ప్రతిష్ఠాహోమం, ధ్వజారోహణ, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం డప్పుచప్పుళ్ల నడుమ అలంకరించిన బండ్లను ఆలయం చుట్టూ ఊరేగింపు, రాత్రి ఆలయ ప్రాంగణంలో వీరభద్ర ప్రస్తావన, అగ్నిగుండాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న..
అసెస్‌మెంట్ దందా!

- గ్రామ పంచాయతీ కార్యదర్శికి యూజర్ ఐడీ లేకుండానే అసెస్‌మెంట్ నెంబర్ కేటాయింపు
- సహకరిస్తున్న కొందరు సబ్ రిజిస్ట్రార్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు
- హైదరాబాద్ నుంచే జరుగుతున్నట్లు అనుమానం
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పెత్తనం చలాయిస్తున్న రైటర్లు

భిక్కనూరు, మార్చి 31: గ్రామ పంచాయతీల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి గ్రామ పంచాయతీల చుట్టూ ప్రజలు తిరడగం తగ్గించాలన్న మంచి ఉద్దేశ్యంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే మ్యూటేషన్ విధానాన్ని గత ప్రభుత్వం తీసుకువచ్చింది. అందుకు ప్రతీ గ్రామ పంచాయతీ రికార్డు గల ప్రతీ ఇంటికి, అప్పటి వరకు గ్రామ కంఠంలో ఉన్న కొన్ని ఇంటి ఖాళీ స్థలాలకు ఆన్‌లైన్ నెంబర్ (అసెస్‌మెంట్ నెంబర్)ను ప్రభుత్వం కేటాయించింది. దీని ప్రకారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇళ్ల స్థలాలు, ఇంటి ఖాళీ స్థలాలకు మొదటిసారి రిజిస్ట్రేషన్ చేసుకోదలిచిన వారు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి రిజిస్ట్రేషన్‌కు కావాల్సిన అసెస్‌మెంట్ నెంబర్‌తో సహా అన్ని ధ్రువీకరణ పత్రాలను ఒక్కసారి తీసుకువస్తే మరల గ్రామ పంచాయతీ చుట్టూ తిరిగే పని లేకుండా మ్యూటేషన్ ప్రక్రియను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్తి అయ్యే విధంగా ఏర్పాటు చేశారు. ఆ ఇళ్లను గానీ, ఇంటి ఖాళీ స్థలాన్ని వేరే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ అయితే గ్రామ పంచాయతీతో సంబంధం లేకుండా నేరుగా వాటిని కొనుగోలు చేసిన వారి పేరుమీదికి ఈ రికార్డు మార్పు చేయడం జరుగుతోంది. ఈ రిజిస్ట్రేషన్ కావాలంటే తప్పనిసరిగా అసెస్‌మెంట్ కావాల్సిందే.

గ్రామ పంచాయతీ కార్యదర్శికి యూజర్ ఐడీ లేకుండానే అసెస్‌మెంట్ నెంబర్ కేటాయింపు

తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం గత ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే చేపట్టిన విషయం విధితమే, ఈ సర్వే ప్రకారం అన్ని గ్రామాల్లోని ప్రతీ ఇంటికి అసెస్‌మెంట్ (ఆన్‌లైన్ నెంబర్) నెంబర్‌ను కేటాయించింది. కొన్నిచోట్ల గ్రామ కంఠంలో ఉన్న ఖాళీ స్థలాలకు సైతం రికార్డులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ రికార్డుల్లో లేని స్థలాలకు, వెంటచర్లకు, వ్యవసాయ భూములకు ఈ అసెస్‌మెంట్ నెంబర్లు జారీ కాకపోవడం లేదు. ఒక వేళ అసెస్‌మెంట్ జారీ చేయాలంటే నాలా కన్వర్షన్ అనంతరం ఇంటి నిర్మాణం చేపట్టే సమయంలో ఆ స్థలం ఏ పరిధిలో ఉంటే ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి తన యూజర్ ఐడీ ఆధారంగా అసెస్‌మెంట్ నెంబర్‌ను కేటాయించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం గతంలో అసెస్‌మెంట్ నెంబర్లు లేని వాటికి (వ్యవసాయ భూములకు, వెంచర్లకు, తదితర వాటికి) సైతం అసెస్‌మెంట్ నెంబర్లను అక్రమంగా గ్రామ పంచాయతీ కార్యదర్శికి సంబంధం లేకుండా ఇప్పిస్తూ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఉన్న కొందరు డాక్యుమెంట్ రైటర్లు కొత్త అక్రమ దందాకు తెర తీశారు. ఒక్కో అసెస్‌మెంట్ నెంబర్‌కు రూ.25వేల నుంచి మొదలు రూ.లక్ష వరకు అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఈ డాక్యుమెంట్ రైటర్లు వసూళ్లు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంతో పాటుగా లక్షలు గడిస్తున్నారు.ఉదాహరణకు దోమకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని భిక్కనూరు మండలంలోని ఒక గ్రామంలో ఖాళీ స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకుంటున్నా, అందుకు గ్రామ పంచాయతీ రికార్డు ప్రకారం తమకు ధ్రువీకరణతో పాటుగా అసెస్‌మెంట్ నెంబర్ కావాలని ఒక వ్యక్తి సదరు గ్రామ పంచాయతీ కార్యదర్శిని కలిశాడు. ధ్రువీకరణ ఇస్తా కానీ అసెస్‌మెంట్ నెంబర్ ప్రస్తుతం ఇవ్వడం లేదని అది కావాలంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలోని పలానా దగ్గర చేస్తారని గ్రామ పంచాయతీ కార్యదర్శి చెప్పడంతో కార్యదర్శి చెప్పిన విధంగానే సదరు వ్యక్తి దోమకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలోని డాక్యుమెంట్ రైటర్ వద్దకు వెళ్లాడు. మాకు సంబంధించిన ఖాళీ స్థలానికి రిజిస్ట్రేసన్ చేయించుకుంటానని ఆ ఖాళీ స్థలానికి అసెస్‌మెంట్ నెంబర్ లేదని మా గ్రామ పంచాయతీ కార్యదర్శి తమను కలుస్తే అసెస్‌మెంట్ నెంబర్‌తో పాటుగా దగ్గరుండి రిజిస్ట్రేషన్ చేయిస్తాడని చెప్పినట్లు అతడితో వివరించారు. అసెస్‌మెంట్ నెంబర్, రిజిస్ట్రేషన్ కలిపి రూ.లక్షా11వేలు అవుతాయని సదరు డాక్యూమెంట్ రైటర్ చెప్పడంతో ఆ వ్యక్తి నోరెల్లబెట్టాడు. ఏమైనా తగ్గుతుందా అని అడుగగా నసీవు ఎక్కడికి వెళ్లిన దీనికి అసెస్‌మెంట్ నెంబర్ రాదని, రిజిస్ట్రేషన్ కాదని, మీ గ్రామ పంచాయతీ కార్యదర్శి నాకు పరిచయం కాబట్టి అతడు చెప్పాడన్నా ఉద్దేశ్యంతో రిస్క్ చేస్తున్నానని చెప్పి లాస్ట్ రూ.లక్షకు చేయిస్తానని బేరం కుదుర్చుకుని అతడు చెప్పిన విధంగానే పంచాయతీ కార్యదర్శి యూజర్ ఐడీతో సంబంధం లేకుండానే ఆ ఖాళీ స్థలానికి అసెస్‌మెంట్ నెంబర్ ఇప్పించి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో చాలా ఉన్నాయి. 2021 డిసెంబరు నుంచి పంచాయతీల్లో రికార్డులను చేస్తూ స్పష్టమవుతోంది.

హైదరాబాద్ నుంచే జరుగుతున్నట్లు అనుమానం?

గ్రామ పంచాయతీ కార్యదర్శుల ప్రమేయం లేకుండా ఎక్కడి నుంచి ఈ అసెస్‌మెంట్ నెంబర్‌లు క్రియేట్ అవుతున్నాయో చాలా మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, అధికారులకు అంతుచిక్కని పరిస్థితి. అమాయకుల అసరాను అవకాశంగా భావించి కొందరూ డాక్యుమెంట్ రైటర్లు చేస్తున్న ఈ అక్రమ దందాకు కొందరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సబ్ రిజిస్ట్రార్‌లు వారికి సహకరిస్తున్నట్లు సమాచారం. కొందరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు డాక్యుమెంట్ రైటర్లు ఇచ్చే కమీషన్‌లకు అలవాటు పడి పలానా దగ్గరుకు వెళ్లితే అసెస్‌మెంట్ నెంబర్ వస్తుందని చెప్పి అమాయకులను ప్రోత్సహించి అక్రమదందా చేస్తున్న డాక్యుమెంట్ రైటర్ల వద్దకు పంపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అసలు మధ్యవర్తుల ద్వారా హైదరాబాద్ కేంద్రంగా ఈ అక్రమ దందా జరుగుతున్నట్లు కొందరు మండల పరిషత్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పెత్తనం చెలాయిస్తున్న రైటర్లు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెత్తనమంతా కొందరు డాక్యుమెంట్ రైటర్లదే. ఒక్కమాటలో చెప్పాలంటే రిజిస్ట్రేషన్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే దాదాపు 90 శాతం పని ఈ డాక్యుమెంట్ రైటర్ల వద్దే అయిపోతోంది. దీంతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకున్న వారు ముందుగా ఎవరైనా వారినే కలిసే పరిస్థితి ఉంది. చలాన్లు, ఇందులో అది తక్కువుంది, ఇది తక్కువుంది, ఆఫీసుల్లో ఇవ్వాలి, పని తొందరగా కావాలంటే కొంత ఎక్కువగా ఖర్చు అవుతుందని ప్లాట్లు, ఇళ్ల రిజిస్ట్రేషన్లకు వెళ్లిన వారిని దోచుకుంటూ వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారు చెప్పిన విధంగా డబ్బులు ఇచ్చిన వారికి ఏమైనా పేపర్లు లేకపోయిన, సాంకేతిక సమస్యలున్నా, ఇతర ఇబ్బందులున్నా అర గంటలో రిజిస్ట్రేషన్ అవుతుంది లేదంటే ఏవేవో కారణాలు చెబుతూ అలస్యం చేయిస్తున్నారు.

ఇలాంటి సంఘటనలు తమ దృష్టికి వచ్చాయి
- మహేష్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షుడు

తమ యూజర్ ఐడీ లేకుండా, తమకు సంబంధం లేకుండా అసెస్‌మెంట్ నెంబర్లు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. ఇలా చేయడం చాలా పెద్ద నేరం. ఎవరైనా ఇంటి నిర్మాణం చేపడుతున్నప్పుడు గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసు అతికించిన 15 రోజుల తర్వాత నోటీసు ఇచ్చిన అనంతరం అనుమతి జారీ చేయడం జరుగుతుంది. ఇంటి పూర్తి తర్వాతనే ఈ అసెస్‌మెంట్ నెంబర్‌ను ఆ ఇంటికి తమ యూజర్ ఐడీ, పాస్వర్డ్ ఆధారంగా కేటాయించడం జరుగుతుంది. తమకు సంబంధం లేకుండా ఈ అసెస్‌మెంట్ నెంబర్లను కేటాయించడం పట్ల తమ సంఘం తరుపున ఖండించడం జరుగుతుంది. దీనిపై విచారణ జరిపి బాధితులపై చర్యలు తీసుకోవాలి.

బాధిత కుటుంబానికి పరామర్శ

మెండోర, మార్చి 31: మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ జమాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో బాధిత కుటుంబసభ్యులను ఆదివారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, కాంగ్రెస్ నాయకులు సుమో రాజేశ్వర్, కొప్పెల మోహన్, బద్దం అశోక్, మౌలానా, బాస్కర్, గంగాధర్, డి.రాజారెడ్డి, సాయికిరణ్, తదితరులు ఉన్నారు.

శక్కర్‌నగర్‌లో వివాహిత ఆత్మహత్య

బోధన్ రూరల్, మార్చి31: బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీకి చెందిన సబియా నౌసీన్ (36) అనే మహిళ ఆదివారం తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. భర్త అదనపు కట్నం కోసం వేధించేవాడని, అత్తింటి వారి వేధింపులు భరించేక ఇంట్లో ఫ్యాను రాడుకు చున్నీతో ఉరి వేసుకుందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

బైక్, సైకిల్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

రుద్రూరు, మార్చి 31: బైక్, సైకిల్ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని అంగడి బజార్ సమీపంలో ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తి బైక్‌పై వెళుతూ సైకిలిస్టును ఢీ కొట్టాడు. తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బర్ధిపూర్ చర్చీలో ఘనంగా ఈస్టర్

డిచ్‌పల్లి, మార్చి 31: మండలంలోని డిచ్‌పల్లి, బర్ధిపూర్, నడిపల్లి, తెలంగాణ ఏడవ పోలీస్ బెటాలియన్, అమృతాపూర్, కంజర్ గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నడిపల్లి చర్చిలో ఈస్టర్ వేడుకల సందర్భంగా చర్చి ఫాదర్ స్టీవెన్ క్రైస్తవులకు ఈస్టర్ వేడుకల సారాంశాన్ని అర్థమయ్యే విధంగా వివరించారు. బర్ధిపూర్ చర్చిలో చర్చి ఫాదర్ దినకర్ మాట్లాడుతూ క్రీస్తు మరణించిన తర్వాత మూడవ రోజు ప్రపంచ మానవాళికి శాంతిస్ఫూర్తిని తెలియజేశారని అయన వివరించారు. ఈస్టర్ వేడుకల సందర్భంగా కొవ్వొత్తులను వెలిగించి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి నాయకులు దేవరాజు, శ్రీనివాస్, పద్మారావు, ప్రకాశం, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

'పేకాట ఆడితే కఠిన చర్యలు'

బోధన్ రూరల్, మార్చి 31: పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ పట్టణ సైఐ వీరయ్య తెలిపారు. శనివారం రాత్రి రాకాసిపేట్‌లో పేకాట ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పేకాట స్థావరం నుంచి 5,740 రూపాలయలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎవరైనా పేకాట నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

సిరికొండ మార్చి 31 : సిరికొండ మండలం పీసరగుట్ట తండాకు చెందిన గిరిజన యువకులు ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు కోసం పనిచేయాలని ఎమ్మెల్యే వారిని కోరారు. పార్టీలో చేరిన వారిలో తిరుపతి నాయక్, లక్ష్మణ్ నాయక్, హరినాయక్, గణపతినాయక్, కేతావత్ హరినాయక్, మహిపాల్ నాయక్, నౌషిలాల్, మోహన్‌నాయక్, తదితరులున్నారు.

'విధులను బాధ్యతతో నిర్వర్తించాలి'

మోపాల్, మార్చి 31: ఏ ఉద్యోగమైనా తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని మాధవనగర్ సాయిబాబా ఆలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ గంగాధర్ అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల్లో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి జిల్లా అర్చక ఉద్యోగుల సంఘం సభ్యులు, తదితరులున్నారు.

నేటి నుంచి ఉపాధి కూలి పెంపు

- ఉపాధి కూలీలకు రూ. 300 పెంచిన కేంద్ర ప్రభుత్వం
- ప్రస్తుతం రూ. 272 చెల్లింపు
- కొత్త వేతనం ఏప్రిల్ 1 నుంచి అమలు

మద్నూర్, మార్చి 31: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ఊరట లభించింది. కేంద్ర ప్రభుత్వం వారి వేతనాలను పెంచింది. ప్రస్తుతం కూలీలు కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ. 272 చెల్లిస్తున్నారు. ఇక నుంచి రూ.300 చెల్లించనున్నారు. ఏప్రిల్ 1 నుంచి పెంపుదల అమలులోకి రానుంది. కూలీల పెంపుపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేయనుండగా, రూ.300 పెంచగా, ఎన్నికల కోడ్ ఉండటంతో ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్నారు. దీంతో ఉమ్మడి మద్నూర్ మండలంలో ఉపాధి పథకంలో పని చేస్తున్న 3వేల మందికి ప్రయోజనం చేకూరనుంది. వేతనం పెరుగడంతో ఎక్కువ మంది కూలీలు పని చేసేందుకు అవకాశముంది. కానీ పేమెంట్‌లో జరుగుతున్న జాప్యం కారణంగా హాజరయ్యే వారి సంఖ్య తగుతుంది.

వేసవిలో పనుల జోరు


మద్నూర్‌లో చేపడుతున్న ఉపాధి పనులు

వేసవిలోనే పథకం పనులు జోరందుకుంటాయి. ఏప్రిల్, మే, జూన్ వరకు పనులు బాగా జరిగి ఆ తర్వాత స్లో అవుతాయి. పథకంలో ఒక కుటుంబానికి జాబ్ కార్డు ఉంటుంది. నలుగురు సభ్యులుంటే నలుగురు పనిచేస్తే 100 రోజులు పని చేస్తారు. ఆ తర్వాత జాబ్ కార్డులో ఉన్న సభ్యులు పనులకు వెళ్లడానికి అవకాశముండదు. పనులు తొందరగా చేసుకుని వంద రోజులు పని చేస్తుండగా, మిగతా వారితో పనులు చేయించడం కష్టం అవుతుంది. వంద రోజులు పూర్తయిన వారు కూడా మళ్లీ కొత్తగా పనులకు వస్తారు. దీంతో పనుల్లో వేగం కనిపిస్తోంది. ప్రతీ కూలీకి వంద రోజులు పని కల్పిస్తే ఉపాధి పనులు పెద్ద ఎత్తున సాగే అవకాశం ఉంటుంది.

మూడేళ్లుగా అందని అలవెన్సులు

వేసవిలో ఎండల తీవ్రతకు నేల గట్టి వారుతుంది. పనులు సాగక కూలీలు ఇబ్బంది పడతారు. కాబట్టి కూలీ గిట్టుబాటు కాదని ప్రభుత్వం వేసవిలో అలవెన్సు ఇస్తారు. చేసిన పనికి ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి, ఏప్రిల్‌లో 25శాతం, మే నెలలో 30 శాతం అదనంగా కూలీ చెల్లించేవారు. మూడు నెలలుగా అలవెన్సులు లేవు. గడ్డపార, తాగునీటికి రూ.5 అదనంగా ఇచ్చే వారు. ఎండలు ఎక్కువగా ఉంటే వడదెబ్బ కొట్టే అవకాశం ఉన్నందున నీడ కోసం సౌకర్యం ఉండేది. ఇతర అలవెన్సులు ఏవీ లేదు.

ఎండలతో పని వేళల్లో మార్పు

ఎండలు మండుతున్నందున కూలీలు వడదెబ్బ బారిన పడకుండా పని వేళల్లో మార్పులు చేస్తున్నారు. అధికారులు సిబ్బందికి ముందుగా కొలతలు ఇచ్చి ఉదయం నుంచి 11 గంటలలోపు కొలతలు ఇచ్చిన తర్వాత పనులు చేసుకోవాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు జరుగకుంటే సాయంత్రం పనులు చేసుకోవాలని సూచిస్తున్నారు.


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో (ఏఎస్‌పీ) కాజల్

హత్య కేసులో నేరస్తుల అరెస్టు

సదాశివనగర్, మార్చి 31: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ శివారులోని ఎన్‌హెచ్ 44 రోడ్డు పక్కన పెద్దచెరువు దగ్గరలో మృతి చెందిన లింగంపేట మండలం పోల్కంపేట గ్రామానికి చెందిన సాయిలును హత్య చేసిన కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సదాశివనగర్ ఎస్‌హెచ్‌వో(ఏఎస్‌పీ) కాజల్ తెలిపారు. మృతుడు సాయిలు ఆరేడు వివాహాలు చేసుకుని అందరిని వదిలేసి జల్సాలకు అలవాటు పడ్డాడని తన భూమిని పూర్తిగా అమ్ముతూ ఆ డబ్బులతో తాగి వచ్చి తల్లి లచ్చవ్వను నిత్యం కొడుతూ, తిడుతూ ఉండేవాడని తెలిపారు. ఆ బాధ భరించలేక నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలానికి చెందిన తన మనుమడు దేవ్‌కు ఫోన్‌చేసి తనను బాధపెడుతున్న సాయిలును ఎలాగైన చంపాలని చెప్పడంతో దేవ్ గతనెల 24న అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ శివారులో సాయిలుకు మద్యం తాగించి తన స్నేహితుడైన కోట మారుతితో కలిసి మెడకు తువ్వాల చుట్టి చంపివేశాడని తెలిపారు. ఈ కేసులో నేరస్తులైన బసకొండ దేవ్, కోట మారుతి, కదాల లచ్చవ్వలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.


నెమ్లి సాయిబాబా ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా శివలింగం ప్రతిష్ఠాపన మహోత్సవం

నసురుల్లాబాద్, మార్చి 31: మండలం నెమ్లి గ్రామ శివారులోని తెలంగాణ షిరిడీ సాయిబాబా ఆలయ సన్నిధిలో పంచముఖ పరమ శివలింగ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కన్నుల పండువగా జరుగుతుంది. మార్చి 30 శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రారంభం కాగా, ఏప్రిల్ 1 వరకు కొనసాగుతున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. మార్చి 30న యాగ గణపతి సంకల్పం నిర్వహించగా 31న వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య హోమం నిర్వహించారు. ఏప్రిల్ 1 విగ్రహ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సాయి ట్రస్ట్ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ట్రస్టు వారు అన్ని ఏర్పాట్లను చేశారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పట్లోళ్ల మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

భిక్కనూరులో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 31: మండలంలోని భిక్కనూరు గ్రామంలో ఆదివారం ఉదయం బాల హనుమాన్ ఆలయం వద్ద ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. గతంలో ఇక్కడ ఉన్న బాల హనుమాన్ మందిరం శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃనిర్మాణం నిమిత్తం కూల్చివేయడం జరిగింది. ప్రస్తుతం ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. వచ్చే నెల 4, 5, 6వ తేదీల్లో బాల హనుమాన్ స్వామి త్రయాహ్నిక ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు రాజు పంతులు, గ్రామ పెద్దలు, యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నుకున్న ఆయా గ్రామాల కమిటీలు

నూతన కమిటీల ఏర్పాటు

గాంధారి, మార్చి 31: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచనల మేరకు గాంధారి మండలంలోని ఆయా గ్రామాల గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. పొతంగల్ కుర్దు, మాధవ్‌పల్లి, బ్రాహ్మణపల్లి, రాంపూర్ గడ్డతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, మనోహర్ రావు, బాలయ్య, భాగ్యనాయక్, పరమేష్, లైన్ రమేష్, రవి, బలవంత రావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కామారెడ్డి రూరల్, మార్చి 31: కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో గల చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌లో ఆదివారం 2003-04 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఉన్నత స్థానాల్లో ఉండి చదువుకున్న పాఠశాలను మర్చిపోకుండా చదువు చెప్పిన పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌రావు, అడ్వైజర్ సుమిత్రానంద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలపై చర్చించాలి

కామారెడ్డి టౌన్, మార్చి 31: కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 వేల మంది ఆటో కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని, తమ సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని ఆటో యూనియన్ నాయకులు ఎమ్మెల్యే హరీష్‌రావుకు ఆదివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోలు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో మా ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కోల్పోయామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు 26 మంది ఆటో డ్రైవర్లు ఆటోలు నడవక ఫైనాన్స్‌లు కట్టలేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు, గుండెపోటుతో మరణించారని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలో ఆటోనగర్ కాలనీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి వెంటనే జీవో విడుదల చేయాలని, ప్రమాదవశాత్తుగాని, అనారోగ్యంతో గాని మరణించిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 5లక్షల ఆర్థిక సహాయం అందించాలని తెలిపారు. ఆటోడ్రైవర్లకు ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి 60శాతం సబ్సిడీ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో జేఏసీ జిల్లా అధ్యక్షుడు నర్సింలు, రాజయ్య, సిద్ధిరాములు, స్వామిగౌడ, హరికృష్ణ, సాయిరాం, బాలరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే హరీష్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న ఆటో కార్మికులు

జంగంపల్లిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భిక్కనూరు, మార్చి 31: భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1998-99 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా ఇతరితర ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు ఒకచోట చేరి ఒకరి నొకరు అప్యాయంగా పలుకరించుకుని క్షేమసమాచారాలను తెలుసుకున్నారు. అనంతరం పాతజ్ఞాపకాలను నెమరువేసుకుంటు రోజంతా సంతోషంగా గడిపారు. ఈ మేరకు ఉపాధ్యాయులను సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.


1998-99 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల

ఇటుక బట్టీలకు కలప తరలింపు

- అనుమతులు లేకుండా ఇటుక బట్టీలకు విలువైన చెట్లు నరికి చేరవేత
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు


ఇటుక బట్టీల వద్ద కలప


ట్రాక్టర్‌లో తరలిస్తున్న అక్రమ కలప

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 31: గ్రామాల్లో పచ్చని చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా చెట్లను నరికి పట్టణాల్లో కట్టెల మిల్లులకు, ఇటుక బట్టీలకు కలప స్మగ్లర్లు యధేచ్ఛగా తరలిస్తున్నారు. గ్రామాలలోని పంట పొలాలలో బీడు భూములలో ఉన్న విలువైన చెట్లను నరికి తరలించాలంటే అటవీ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కాని ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో కలప స్మగ్లర్లు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా గ్రామీణ ప్రాంతాల భూముల్లో ఉన్న చెట్లను నరికి వేసి కట్టే మిల్లులకు ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఎలాంటి నిబంధనలు పాటించకుండా జంకు బొంకు లేకుండా చెట్లను నరికి తరలిస్తున్నారు. అయితే ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అటవీ శాఖ అధికారులు పర్యావరణాన్ని కాపాడాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో కట్టే వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది. ఈ దందాను అధికారులు అడ్డుకోకుండా వారిని మచ్చిగ చేసుకుని వాల్టా చట్టాన్ని తమకు అనుకూలంగా మలుచుకుని కలప స్మగ్లర్లు దళారులు రెచ్చిపోతున్నారు.

● పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి లింగంపేట్, గాంధారి నాగిరెడ్డిపేట్ మండలాల పరిధిలో అన్ని గ్రామాలలోని వ్యవసాయ భూముల్లో బీడు భూములలో ఉన్న రకరకాల చెట్లను అనుమతులు లేకుండా చెట్లను నరికి కట్టెను కలప స్మగ్లర్లు ఇటుక బట్టీలకు కట్టే మిల్లులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ రవాణాదారులు స్మగ్లర్లు అడ్డు అదుపు లేకుండా వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం దాడులు చేసిన దాఖలాలే లేకపోవడంతో అధికారుల పనితీరుపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరో ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులు మెప్పు పొందడానికి తూతూ మంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారే తప్ప అక్రమ కలప రవాణాలను అరికట్టడానికి పటిష్ఠమైన చర్యలు తీసుకోవడం లేదు. వాస్తవంగా అటవీ శాఖ అధికారుల అనుమతితో పాటు సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి ఈ చెట్లను నరికి తరలించడం వల్ల పర్యావరణానికి నష్టం ఉందని సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆచరణలో మాత్రం కలప రవాణాదారులు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్నారు.

● ఇటుక బట్టీలకు వందల ట్రిప్పులు తరలింపు

ఇటుక బట్టీలు కాల్చడానికి కలప తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. దీంతో అడ్డగోలుగా చెట్లను నరికి గ్రామీణ ప్రాంతంలోని ఇటుక బట్టీలకు కలప తరలిస్తున్నారు. అటవీ చట్టం ప్రకారం చింత చెట్లను మోదుగు చెట్లను నరికి తరలించకూడదు ఇలా చేస్తే కఠినమైన శిక్షలు ఉంటాయి. అయిన ఇవేమి పట్టనట్లు అన్ని రకాల చెట్లను నరికి ఇటుక బట్టీకు మరికొన్ని కట్టే మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోకపోతే పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని పలువురు వాపోతున్నారు.

నేడు ఎంపీపీపై అవిశ్వాసం

రామారెడ్డి,మార్చి 31:రామారెడ్డి మండల ఎంపీపీ దశరథ్‌రెడ్డిపై అవిశ్వాస సమావేశంను సోమవారం నిర్వహించనున్నట్లు ఇంచార్జ్ ఎంపీడీఓసవిత తెలిపారు. ఎంపీపీపై మండల ఎంపీటీసీలు ఇచ్చిన అవిశ్వాస నోటిసులకు అనుగుణంగా ఈ సమావేశం ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు.

తండ్రికి కర్మకాండ నిర్వహించిన కూతురు


తండ్రికి కర్మకాండ చేస్తున్న కూతురు జ్యోతి

తాడ్వాయి,మార్చి 31: తాడ్వాయి మండల కేంద్రంలో ఆదివారం మెట్టు బాలరాజు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు తన కుమార్తె జ్యోతి కర్మకాండ నిర్వహించారు. అన్నితానై అంత్యక్రియల్లో పాల్గొనడంతో కూమారులు లేని లోటును తీర్చి కన్నతండ్రి రుణం తీర్చుకుందని చుట్టుప్రక్కల వారు కన్నీటి పర్యంతమయ్యారు.

సీసీరోడ్డు పనులప్రారంభం

తాడ్వాయి,మార్చి 31: మండలంలోని కృష్ణాజీవాడిలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీసీరోడ్డుపనులు ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గెలుపొందిన తక్కువ కాలంలోనే గ్రామ అభివృద్ధికోసం సీసీరోడ్డుకు నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రాంరెడ్డి, షౌకత్‌అలీ, జంగంరాజు, నరసింహరెడ్డి, దత్తారెడ్డి, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 యాక్టు అమలు

కామారెడ్డిటౌన్, మార్చి 31: జిల్లాలో 30 యాక్టు అమలులో ఉందని ఎస్పీ సింధూశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 వరకు ఈ యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించిన నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

లింగంపేట, మార్చి 31 : లింగంపేట మండల కేంద్రంలోని మాత రేణుకా ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవం సోమవారం మాత ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణ మహోత్సవం నిర్వహించబడునని ఆలయ నిర్వాహకుడు రవిగౌడ్ తెలిపారు. మంగళవారం బోనాల ఊరేగింపు నిర్వహించబడును కావున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదం పొంది తీర్థప్రసాదంలు పొందాలని ఆయన కోరారు

32, 33వార్డులో సంపర్క్ యోజన కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్ మార్చి31: మున్సిపల్ పరిధిలోని 32, 33వార్డులలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం లాబర్థి సంపర్క్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లాబర్థి సంపర్క్ యోజన కన్వీనర్ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను గెలిపించి ప్రధాని నరేంద్రమోదీకి బహుమతిగా ఇవ్వాలని వారు కోరారు. అనంతరం మోదీ స్టిక్కర్‌ను కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్‌కుమార్, పొల్కం వేణు, శికారి శ్రీనివాస్, డికెశ్రీనివాస్, దోండి ప్రకాష్, పాలబాస్కర్, దక్షిణమూర్తి, నారాయణపేట్ రాజేందర్, పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా కనక రవి

జక్రాన్‌పల్లి, మార్చి31: జక్రాన్‌పల్లి మండల ఎస్సీసెల్ అధ్యక్షునిగా కనక రవిని నియమించారు. ఈ మేరకు ఆదివారం కనక రవిని నియామక పత్రాన్ని ఎమ్మె ల్యే డాక్టర్ భూపతిరెడ్డి అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షు డు లింగం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల యువజన విభాగం యూత్ అధ్యక్షుడు వినోద్, రూరల్ యూత్ అధ్య క్షుడు నరేష్, మాజీ సర్పంచ్ మునిపల్లి సాయిరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిశోర్, ప్రధానకార్యదర్శి వినోద్, మాల మహనాడు జిల్లా యూత్ అధ్యక్షుడు కిరణ్ అనుపాల్, తదితరులు పాల్గొన్నారు.

గొట్టిముక్కలలో పోచమ్మల ప్రతిష్ఠాపన


యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

దోమకొండ, మార్చి 31: మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో ఆదివారం కొత్త పోచమ్మ, మత్తడి పోచమ్మ అమ్మవార్ల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ధ్వజారోహణం, స్వస్తి పుణ్యవహచనం, నవగ్రహ పూజ, హోమం, కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం ఉదయం 9.17కు కొత్త పోచమ్మ, మత్తడి పోచమ్మ అమ్మవార్ల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, 11.30కు అమ్మవారి కల్యాణము, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు




రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210